
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

బుధవారం 26 జూన్ 2024

బీపీటీ బ్లాక్

- నల్లబజారులో వరి విత్తనాలు
- కొరత పేరుతో బహిరంగ మార్కెట్లో దందా
- అవకాశం ఉన్నంత వరకు రైతుల నుంచి దోపిడీ
- డీసీఎంఎస్ కేంద్రాల్లోనూ అధిక ధరకు అమ్మకాలు

అడపాదడపా వర్షాలు పడుతున్నాయి.. పదునెక్కిన పొలాల్లో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువులను డిమాండ్‌కు అనుగుణంగా సిద్ధం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. ఇదే అవకాశంగా రైతులను అందినకాడికి దోచుకోవడానికి వ్యాపారులు సిద్ధమయ్యారు. వరిలో డిమాండ్ ఉండే బీపీటీ రకం విత్తనాలను బ్లాక్ చేసేశారు. కొరత పేరుతో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ శాఖల తరపున అమ్మకాలు జరుపుతున్న కేంద్రాల్లోనూ దోపిడీ తప్పడంలేదు. విత్తనాల కొరత పేరుతో అదనపు ధరకు విక్రయిస్తున్నా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు పట్టించుకోకపోవడంతో విత్తనాల నల్లబజార్ వ్యాపారం జోరుగా సాగిపోతోంది. ఖరీఫ్‌కు ఆర్‌బీకేలు రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలపై ఇండెంట్లు పంపలేదు. మార్కెటింగ్ శాఖ ప్రతి ఏడాది అమ్మకాలు జరిపే పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని విత్తనాలను ఆయా విక్రయ కేంద్రాలకు పంపారు. అయితే ఇక్కడా అధిక రేట్లు తప్పడంలేదు.. రైతులు దోపిడీకి గురవుతున్నా పట్టించుకోవడంలేదు. 25 కిలోల బస్తాకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు అవకాశం ఉన్నంతవరకు రైతుల దగ్గర నుంచి దోచేస్తున్నారు.

14,275 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సందడి వచ్చేసింది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 5.71 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటుంది. ఒక్కో ఎకరాకు 20 కిలోల వరకు వరి విత్తనాలు అవసరం. ఎలుకల బెడద, ఇతర కారణాలతో నారు దెబ్బతినిపోతుందన్న ముందుచూపుతో రైతులు ఎకరాకు 25 కిలోల బస్తా తీసుకుంటున్నారు. 5.71 లక్షల ఎకరాలకు 25 కిలోల చొప్పున 14,275 క్వింటాళ్ల వరి విత్తనాల అవసరం ఉంది. అయితే ఆ మేరకు రైతు భరోసా కేంద్రాల నుంచి కానీ వ్యవసాయ శాఖ నుంచి కానీ ప్రభుత్వానికి ఇండెంట్ పంపలేదని సమాచారం. వ్యాపారులు విత్తన కొరత సృష్టించడంతో రైతుల్లో ఆందోళన మొదలైనా వ్యవసాయ శాఖ అధికారుల్లో చలనం లేదు.



- విత్తనాల బస్తాలను బండిపై తీసుకు వెళుతున్న రైతు



- నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతు

తెనాలి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు వ్యవసాయ శాఖ విత్తన అవసరాలు ఎంతనేది గుర్తించి ఏపీ సీడ్స్ ప్రైవేటు కంపెనీల ద్వారా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని విస్మరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా అని చెప్పి కాలం గడిపారు. ఈ ఏడాది కూడా అదే తీరును చేయడంతో వ్యాపారుల పంట పండింది. తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలు అందవేమోనని రైతులు గాబరా పడుతుండగా.. అధికారులు ఆ విషయం తమకు సంబంధించినది కాదన్నట్లుగా ఉన్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా సబ్సిడీలను ఎగ్గొట్టేందుకు ఆర్‌బీకేల ద్వారా విత్తన విక్రమాలను చేపట్టింది. ఆర్బీకేల ద్వారా విత్తన విక్రయాలు తూతూమంత్రంగా చేపట్టారు. దీనిని ఆసరా చేసుకుని బయటి వ్యాపారులు ఇష్టానుసారంగా అధిక ధరలకు విత్తనాలను విక్రయించడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం విత్తనాల కొరత అంతగా లేకపోయినా వ్యాపారులు విత్తన కొరతను సాకుగా చూపి రైతులను దోచేస్తున్నారు. వారిదగ్గర ఉన్న విత్తనాల్లో ఎక్కువ డిమాండ్ ఉన్న బీపీటీ విత్తనాలను అధికరేట్లకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీపీటీ 5204, ఎంటీయూ 1262, 1224, 1061 రకాలను ఎక్కువగా పండిస్తున్నారు. అయితే వీటిలో బీపీటీ విత్తనాలకే నల్లబజార్ వ్యాపారం ఎక్కువగా సాగుతోంది. మార్కెటింగ్ శాఖ ద్వారా డీసీఎంఎస్ కేంద్రాల్లో గత ఖరీఫ్‌కు 25 కిలోల బీపీటీ 5204 విత్తనాల బస్తా రూ.1030కి అమ్మితే, ఈ ఏడాది రూ.1100 చేశారు. ఒక సీజన్‌కే బస్తాకు రూ.70 పెంచేశారు. దీనితో సరిపెట్టుకుందామనుకుంటే, కొన్ని కేంద్రాల్లో రైతుల అవసరాలను అదనుగా చేసుకుని బస్తాకు రూ.50 నుంచి రూ.100కిపైగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. అదేమని రైతులు ఎవరైనా అడిగితే అవన్నీ మా జేబులోకి వెళ్లవని, పైవారికి పంపాలని చెప్పిమరీ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. బీపీటీ రకాల్లో కూడా కరీంనగర్, వరంగల్ ప్రాంతాల విత్తనాలకు తక్కువ డిమాండ్ ఉంటే, నంద్యాల రకాలకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో కరీంనగర్, వరంగల్ విత్తనాలను బస్తాపై రూ.50కి అదనంగా అమ్మేస్తుంటే, నంద్యాల రకాలను మాత్రం నిలబెట్టి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల, తెనాలి, పొన్నూరు ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఈ అధిక రేట్ల దోపిడీ సాగుతోందనేది రైతుల మాట. దుగ్గిరాలలో రూ.100 చొప్పున అదనంగా ఇవ్వాల్సిందేనని సిబ్బంది డిమాండ్ చేయటంతో సోమశేఖర్ అనే రైతు బిల్లు కావాలని కోరగా సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఇక వ్యాపారులు ఒక్కో రైతు దగ్గర ఒక్కోరేటు తీసుకుంటున్నారు. ఏ రకం విత్తనాలకయినా రూ.100 అదనంగా తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు.



సాధారణంగా.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నకిలీలు ఉంటాయి. ఈ నకిలీలను పసిగట్టాల్సిన.. అరికట్టాల్సిన.. వ్యవసాయ శాఖ కూడా నకిలీ మయంగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. నకిలీలను గుర్తించి చర్యలు తీసుకో వాల్సిన వ్యవసాయ అధికారులు కూడా నకిలీ సర్టిఫి కెట్లతో ఉద్యో గాలు వెలగబెడుతున్నారంటే ఆశ్చ ర్యం కాదు. ఇలాంటి వారు రైతు లకు వ్యవసాయ పాఠాలు ఏవిధంగా చెప్తారో ఎవరికీ తెలియదు. పదో తరగతి ఫెయిలై.. ఇంటర్‌లో ఎంసీపీ చదివిన వారు కూడా ఏజీబీఎస్సీ సర్టిఫికెట్లు పొంది ఏవోలుగా ఉద్యోగాలు సాధించారు. పదో తరగతి పాసై.. ఇంటర్‌లో బైపీసీ చదివిన వారికే ఏజీబీఎస్సీ చదివే అవకాశం ఉంటుంది. అయితే అలాంటిదేమీ లేకుండా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో ఏజీబీఎస్సీ చదివినట్లుగా సర్టిఫికెట్లు పుట్టించి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఉద్యోగాలు సాధించారు. వీరిపై గత టీడీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించగా.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పట్టించుకోలేదు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సాధించిన పలువురు ఏవోలుగా ఏడీఏలుగా ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఏవోల్లోనూ.. నకిలీలు

అన్నీ పెద్ద తలలే..

అసలు వైద్యం తెలియని వ్యక్తి డాక్టర్ అవతారం ఎత్తితే ఎంత ప్రమాదం జరుగుతుందో.. అర్హత లేని వ్యక్తి వ్యవసాయ అధికారిగా చెలామణీ అయితే అంతకంటే ఎక్కువ ప్రమాదం జరుగుతుంది. అయినా వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లోని కొందరు పెద్ద అధికారులు నకిలీ వ్యవసాయ అధికారులు కేసును నీరుగార్చడంలో ప్రధాన పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. యూనియన్‌కు చెందిన ఓ నాయకుడి సతీమణి కనుసన్నల్లోనే ఇతర రాష్ట్రాల యూనివర్సిటీలు అడ్మిషన్లు ఇస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వారే ఊరు పేరులేని యూనివర్సిటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా ఉండేందుకు అప్పట్లో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు.

- సాగంటే తెలియని అధికారులు
- ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర డిగ్రీలతో ఉద్యోగాలు
- ఎంపీసీ.. పది ఫెయిలైనా ఏజీబీఎస్సీ సర్టిఫికెట్లు
- ఆ సర్టిఫికేట్లతో ఉద్యోగోన్నతులతో అర్హులకు అన్యాయం
- విచారణ నివేదికను బుట్టదాఖలు చేసిన వైసీపీ ప్రభుత్వం

గుంటూరు సిటీ, జూన్ 25: ఖరీఫ్.. రబీ అంటే ఏమిటో వారికి తెలియదు. భూమిలో ఉండాల్సిన పోషకాలు ఎన్నో అసలే ఎరుగరు. పది మంది రైతులను కూర్చోబెట్టి పట్టుమని పది నిమిషాలు పంటల సాగుపై అవగాహన కల్పించలేరు. అయినా వారు ఏవో(అగ్రికల్చర్ ఆఫీసర్, వ్యవసాయ అధికారులు)లు అయ్యారు. కొందరు ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్)లు కూడా అయ్యారు. వీరంతా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏజీబీఎస్సీ(అగ్రికల్చర్ బీఎస్సీ)లు చదివినట్లు డిగ్రీలు పుట్టించి దొడ్డిదారిలో ఇక్కడ ఉద్యోగాలు పొందారు. కొందరు ఇంటర్‌లో ఎంపీసీ చదివినా ఆ తదుపరి ఏజీబీఎస్సీ చదివినట్లుగా డిగ్రీలు తెచ్చారు. కొందరు పదో తరగతి తప్పినా కూడా ఏజీబీఎస్సీ చదివినట్లు సర్టిఫికెట్‌లు పుట్టించి ఉద్యోగాలు కొట్టేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం ఈ బాపతు ఏవోలే ఎక్కువ మంది ఉన్నారు. 2018లో వీరిపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విచారణకు కమిటీ వేయగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నివేదికను బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. అనర్హులు అందలాలు ఎక్కడంతో అర్హులైన వారు ఇంకా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులుగానే మగ్గిపోతున్నారు.

తేలికగా డిగ్రీలు

మన రాష్ట్రంలోని వ్యవసాయ కళాశాలల్లో ఏజీబీఎస్సీ సీటు రావడం చాలా కష్టం. ఒక వేళ సీటు వచ్చినా నాలుగేళ్ల చదివి 156 పరీక్షలు రాస్తేనే డిగ్రీ వస్తుంది. ఇంత కష్టం మనం ఎక్కడ పడతాములే అనుకున్న వారు ఉత్తరప్రదేశ్(ఆగ్రా యూనివర్సిటీ), మహారాష్ట్ర(బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ) నుంచి తేలిక పద్ధతిలో డిగ్రీలు తెచ్చుకున్నారు. అక్కడ సాయంత్రం కాలేజ్ పేరుతో ఈ చదువులు సాగాయి. వాస్తవానికి ఏజీబీఎస్సీ చదవాలంటే ఇంటర్‌లో బైపీసీ చదవాలి. పొరుగు రాష్ట్రాల యూనివర్సిటీల నుంచి డిగ్రీలు పొందిన వారు ఇంటర్‌లో ఎంపీసీ చదివినా ఏజీబీఎస్సీ చదివినట్లుగా డిగ్రీలు ఇచ్చారు. కొందరు అసలు పదో తరగతి కూడా చదవకుండానే డిగ్రీని పట్టేశారు.

విచారణ లేకుండానే..

నకిలీ డిగ్రీలతో వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందిన వారంతా ఒకే వర్గానికి చెందిన వారు. ఉమ్మడి జిల్లాలో 19 మంది ఈ బాపతు వారే ఉన్నారు. అప్పట్లో రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఉద్యోగాలు



పొందారు. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక పోలీసు విచారణ ఉంటుంది. వీరి విషయంలో అటువంటిదేమీ జరగలేదని సమాచారం. కనీసం ఏజీబీఎస్సీ సర్టిఫికెట్‌లు ఇచ్చిన యూనివర్సిటీలు ఉన్నాయా లేదా అని కూడా విచారించిన నాథుడు లేడు. నకిలీ సర్టిఫికెట్లతో కొందరు వ్యవసాయ అధికారులుగా ఉద్యో గాలు పొందడంపై 2018లో పెద్ద దుమారం రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పద్ధతిలో 175 మంది ఉద్యోగాలు పొందడంపై ఏజీబీఎస్సీ చదివిన విద్యార్థులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమృతకుమార్ కమిటీని నియమించింది. దాంతో పాటు త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. సీఐడీ కూడా దర్యాప్తు ప్రారంభించింది. అక్ర మాలు జరిగినట్లు విచా రణలో తేలినట్లు సమాచారం. ఇంతలో ప్రభుత్వం మారడంతో విచారణ నివేదికలు బుట్టదాఖలయ్యాయి.

తీరని అన్యాయం

నకిలీ డి గ్రీల తో కొంద రు వ్యవసాయ అధికారులుగా ఉద్యో గాలు పొందడం వల్ల అర్హులైన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. నకిలీ డిగ్రీతో ఉద్యోగం పొందిన వారిలో కొందరు ఏడీఏలుగా కూడా ఉద్యోగోన్నతి పొందారు. వాస్తవానికి మన రాష్ట్రంలో ఏజీబీఎస్సీ చదివిన వారికి ఎక్కువ మార్కులు ఉన్నప్పటికీ, పక్క రాష్ట్రాల డిగ్రీలకు ఎక్కువ గ్రేడ్ పాయింట్లు ఉన్నట్లుగా చూస్తుండటంతో ఉద్యోగోన్నతుల్లో ఇక్కడ చదివిన వారికి అన్యాయం జరుగుతోందంటు న్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 45 మంది వ్యవసాయ విస్తరణ అధికా రులుగా పనిచేస్తున్నారు. వారికి ఎప్పుడో వ్యవసాయ అధికారులుగా ఉద్యోగోన్నతు లు రావాల్సి ఉంది. వక్రమార్గంలో వచ్చిన వారి వల్ల వీరికి కూడా అన్యాయం జరు గుతుందని చెబుతున్నారు. టీడీపీ ప్రభు త్వం ఈ వ్యవహారంపై లోతైన విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నూతన కలెక్టర్‌కు.. ఎన్నో సవాళ్లు

- పలు శాఖల ప్రక్షాళన చేసి తీరాల్సిందే
- సాగునీటి ప్రాజెక్టులకి భూసేకరణ సమస్య
- రెవెన్యూపై స్వప్నిల్ నివేదికకు మోక్షం కలిగేనా
- కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి నేడు బాధ్యతల స్వీకారం

గుంటూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దారుణంగా రహదారులు.. అనేక సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్.. అతీగతి లేని భూసేకరణ.. రెవెన్యూ శాఖ ప్రక్షాళన.. వివిధ శాఖల్లో అవినీతి.. రేషన్ మాఫియా.. ఇలా ఎన్నో అంశాలు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్న కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మికి స్వాగతం పలుకుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా విభజన అనంతరం నాగలక్ష్మి రెండో కలెక్టర్‌గా ఛార్జి తీసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పాలనాధికారిగా ఆమె ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుడు కార్యక్రమాలు మినహా అభివృద్ధిపరంగా శూన్యమనే చెప్పాలి. ఐదేళ్లలో జిల్లాలో చెప్పుకోదగిన ఒక్క ప్రాజెక్టు నిర్మాణం జరగలేదు. రోడ్ల పనులను ఎన్నికల ముందు మమ అనిపించారు. అనేక సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయకపోవడంతో అవి పెండింగ్‌లో పడిపోయాయి. వివిధ ప్రభుత్వ శాఖల ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఆ పనిని రెవెన్యూ నుంచే చేపట్టాలి. ఏళ్ల తరబడి అనేకమంది ఉద్యోగులు కలెక్టరేట్, గుంటూరు ఆర్‌డీవో, తూర్పు, పశ్చిమ తహసీల్దార్ కార్యాలయాలు, భూసేకరణ యూనిట్లలో కొనసాగుతున్నారు. కొందరైతే వేరే శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి పాతుకుపోయారు. వీరిపై గతంలో ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన స్వప్నిల్ నివేదికని రూపొందించి అప్పటి అధికారులకు నివేదించారు. దానిని అమలు చేయగలిగితే చాలావరకు రెవెన్యూ శాఖ ప్రక్షాళన పూర్తి అవుతుంది. నేటికీ కొంతమంది అధికారుల నివాసాల్లో రాచరిక పోకడలు కనిపిస్తోన్నాయి. అవసరానికి మించి సిబ్బంది వారి నివాసాల్లో కొనసాగుతున్నారు. వారందరిని వెనక్కు రప్పించి ఖాళీల్లో సర్దుబాటు చేయాలి. ఇక పౌరసరఫరాల శాఖ పూర్తిగా పడకేసింది. ఎండీయూ వ్యవస్థకి మేలు చేసేందుకు ఆ శాఖ తనకు తానుగా చేతులు కట్టేసుకున్నది. ఈ నేపథ్యంలో ఆ శాఖ ప్రక్షాళన పైనా నూతన కలెక్టర్ దృష్టిపెట్టాలి. కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉన్న వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్, ఖజానా, సహకార, రోడ్లు, భవనాల శాఖలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఖజాన శాఖలో సిబ్బంది చేతులు తడపనిదే ఏ ఫైలు ముందుకు కదలని పరిస్థితి. సహకారశాఖ బ్యాంకులు, సొసైటీల్లో అవినీతి రాజ్యమేలుతున్నది. జీడీసీసీ బ్యాంకులో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తు సక్రమంగా జరగడం లేదు. నకిలీ పురుగుముందులు, కల్తీ విత్తనాలు, ఎరువులకు గుంటూరు జిల్లా తెలుగు రాష్ట్రాలకే కేంద్ర బిందువుగా మారింది. బయో ఎరువుల పేరుతో చేస్తోన్న మోసాలు అన్ని ఇన్ని కావు. వ్యవసాయ శాఖ అధికారులకు ఈ విషయం తెలియనది కాదు. అయినప్పటికీ మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి అడపదడపాగా సీజ్ చేయడం మినహా పెద్దగా కేసులు నమోదు చేయరు. రోడ్లు, భవనాల శాఖ ఒకప్పుడు ఆర్‌వోబీలు, వంతెనలు, మేజర్ రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతుండేది. వర్షాకాలంలో గుంతలు పడితే వెంటనే తాత్కాలిక రిపేర్లు, ఆ తర్వాత శాశ్వత రిపేర్లు చేసి రోడ్లు వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేలా చేసేది. అలాంటిది వైసీపీ ప్రభుత్వంలో ఆ శాఖ పూర్తిగా పడకేసింది.

సాగునీటి ప్రాజెక్టుల విషయానికి వస్తే గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం తొలి దశ, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. కేవలం భూసేకరణ నోటిఫికేషన్లు విడుదల చేశారే తప్ప అందులో ఎలాంటి చిత్తశుద్ధి లేకుండా పోయింది. నిధులు పుష్కలంగా ఉండే డ్వామా నిధులను కూడా గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదు. జగనన్న కాలనీల లేఅవుట్ల పేరుతో గత ప్రభుత్వం సాగించిన అవినీతి అంతా ఇంతా కాదు. గత ప్రభుత్వంలో నిర్వహించిన స్పందన నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రజల అర్జీలు కేవలం తీసుకోవడానికే పరిమితమయ్యారు తప్ప పరిష్కరించకపోవడంతో చాలామంది ఏళ్లతరబడి అర్జీలు చేతబట్టుకుని తిరుగుతూనే ఉన్నారు.

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకారం

జిల్లా నూతన కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. విజయనగరం నుంచి ఆమె ఉదయం 10.30 గంటలకు గుంటూరు కలెక్టరేట్‌కు చేరుకుని చార్జి తీసుకుంటారని ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి గణియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్దీత సమయానికి జిల్లా అధికారులు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు.



కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

- పరిష్కరించాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు

మంగళగిరి, జూన్ 25: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సామాన్యుల నుంచి ఉద్యోగులు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు లోకేశ్ ప్రజాదర్బార్‌కు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు తమ సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. ప్రజల నుంచి అర్జీలను లోకేశ్ స్వీకరించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన సీఆర్డీఏ పింఛన్ పునరుద్ధరించాలని ఎర్రబాలేనికి చెందిన తాడిబోయిన నాగరాజు కోరారు. ఎన్టీఆర్‌జిల్లా మైలవరం మండలం పొందుగలలో తనకు వంశపారంపర్యంగా వచ్చిన వ్యవసాయభూమి, నివాసస్థలాన్ని తన బంధువులు కబ్జాచేశారని, వారిపై చర్యలుతీసుకుని తనకు న్యాయంచేయాలని మంగళగిరికి చెందిన మల్లెల రామారావు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె వైద్యానికి ఆర్థికసాయం చేయాలని ఎం.సుజాత(ఆత్మకూరు), డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని నాగభవాని(పాతమంగళగిరి) అర్జీలు అందజేశారు. నూతన వైద్యకళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి సంబంధించి జీవో 107, 108లతో పేద, మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతున్నారని, ఆ జీవోలను రద్దుచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. వైసీపీ ప్రభుత్వం విధులనుంచి తొలగించిన ఏపీ కో స్టల్ సెక్యూరిటీపోలీస్, టెక్నికల్ బోటుసిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు.

గోల్డ్ హబ్‌గా మంగళగిరి

మంగళగిరిని గోల్డ్ హబ్‌గా తీర్చిదిద్దుతాననే ఎన్నికల హామీకి కట్టుబడి ఉన్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన లక్ష్మీ నరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి విన్నవించారు. స్వర్ణకార వృత్తిదారులను ఆదుకునేందుకు ఆరు నెలల్లో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని లోకేశ్ అన్నారు.

ఆళ్ల రైట్‌హ్యాండ్‌పై చర్యలు తీసుకోవాలి

ఉండవల్లి పంచాయతీలో మహిళా పారిశుధ్యకార్మికులపై లైంగిక వేధిపులతోపాటు అనేక రకాలుగా ఇబ్బందిపెడుతున్న సూపర్‌వైజర్ పిల్లి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రైట్‌హ్యాం డ్‌గా పేరుగాంచిన డి.రాంబాబును విధుల నుంచి తొలగించాల ని మహిళా కార్మికులు లోకేశ్‌ను కోరారు. తమకు వేతనాలు పెంచి రైతు కూలీ పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. వారిపై చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.



దివ్యాంగుడి సమస్య వింటున్న మంత్రి లోకేశ్

పిన్నెల్లీ.. రాజకీయ సన్యాసం ఎప్పుడు..?

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 25: మాట తప్పడం.. మడమ తిప్పడం పిన్నెల్లి వంశంలో లేదని, అన్న మాటకు కట్టుబడి ఉంటారని నా నమ్మకం.. ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎప్పుడు సన్యాసం తీసుకుంటారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 2024 ఎన్నికల ప్రచార సమయంలో అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనను ఓడించే స్థాయి జూలకంటి బ్రహ్మానందరెడ్డికి లేదని, ఒకవేళ తనను ఓడిస్తే రాజకీయాలకు దూరంగా ఉంటానంటూ అవసరమైతే శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని పలుమార్లు ప్రగల్భాలు పలికిన రామకృష్ణారెడ్డి మాటమీద నిలబడతాడా...! అని ఎమ్మెల్యే జూలకంటి ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో వరుసగా నాలుగుసార్లు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి గెలిచాక రాబందుల్లా పట్టి పీడించారన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం, అక్రమ మద్యం, ఇసుక, పాన్‌పరాగ్, గుట్కా, అక్రమ మైనింగ్, గ్రానైట్ తరలింపుతో కోట్లు గడించారన్నారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేశారని, ఆధిపత్యం కోసం గ్రామాల్లో హత్యలకు పురిగొల్పారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వాస్తవాలు గుర్తించి ఓటుతో ఇంటికి పంపించారని పేర్కొన్నారు. షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పారిపోయి ఎక్కడ తలదాచుకున్నాడో అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో తమ రౌడీగ్యాంగ్‌ను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతును అణచివేసి దౌర్జన్యాలు, దోపిడీలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి నేడు కనిపించకుండా పారిపోయాడన్నారు. త్వరలోనే పిన్నెల్లి సాగించిన అక్రమ దందాలు, సంపాదన, అరాచకాలపై దర్యాప్తు జరిపించి సరైన గుణపాఠం చెప్తామని ఎమ్మెల్యే అన్నారు. విజనరీ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని, ప్రభుత్వానికి అండగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ సహకారంతో మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

28న జాబ్‌మేళా

గుంటూరు(విద్య), జూన్ 25: ఈనెల 28న గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే రఘు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఉదయం 9.30గంటలకు బయోడేటా, ఇతర అర్హతపత్రాలతో రావాలని సూచించారు. వివరాలకోసం 63648 67800, 63648 67801లో సంప్రదించాలన్నారు.

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

● ఎమ్మెల్యేలు, నేతల చుట్టూ ప్రదక్షిణలు
● హామీ రాకపోవడంతో రూటు మార్చిన ఖాకీలు
● ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన నేతలతో బేరసారాలు

గుంటూరు, జూన్ 25: ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అనుకున్న పోస్టింగ్ సాధించడంలో ఆరితేరిన ఓ పోలీసు ముఠా యథావిధిగా ఈసారి కూడా రంగంలోకి దిగింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఈ ముఠా 'సూట్ కేస్ కొట్టు పోస్టింగ్ పట్టు' అనే నినాదంతో విజయవంతంగా పోస్టింగ్స్ సాధించింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కొందరు అధికారులను టార్గెట్ చేసి వెంటాడి వేటాడింది. వీఆర్ పేరుతో కనీసం జీతం కూడా రానిచోటకు మరికొందరిని తరిమేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదేళ్లలో ప్రభుత్వ వేధింపులకు గురైన అధికారులకు న్యాయం జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. అయితే వారికి పోస్టింగ్స్ వస్తాయో లేదో అనే అనుమానాలు కలిగేలా పైరవీ ముఠా రంగంలోకి దిగింది. ఈ ముఠా నేరుగా టీడీపీ సీనియర్ నేతలను కలిసే సాహసం చేయలేక ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులను సూట్ కేసులతో కలిసి ప్రసన్నం చేసుకునే పనిలో పడిందనే విమర్శలున్నాయి. సీనియర్ నాయకులు, గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి నియోజకవర్గంపై పట్టు ఉంది. దీంతో అక్కడ పోస్టింగ్స్ విషయంలో ఎవరెవరిని నియమించుకోవాలనే దానిపై వారికి స్పష్టమైన అవగాహన ఉంది. దీంతో పైరవీ ముఠా ఆ సీనియర్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లే సాహసం చేయలేదు. పార్టీలోకి కొత్తగా వచ్చినవారికి ఇక్కడి పరిస్థితుల మీద అవగాహన లేకపోవడంతో, ఈ పైరవీ ముఠా ఆయా ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించింది. అయితే వారినుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఎన్నికలకు ముందు వైసీపీతో పాటు ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులను, ఇతర కూటమి నేతలను కలసి బేరసారాలు సాగిస్తున్నట్లు పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది. ఆయా నేతలు ఇప్పటికే వారికి హామీ కూడా ఇచ్చినట్లు సమాచారం. గడిచిన 10 ఏళ్లలో ఈ ముఠాలోని అనేకమంది పోలీస్ అధికారులు గుంటూరుతో పాటు జిల్లాలో కీలకమైన పోలీస్‌స్టేషన్లలో ఏళ్ల తరబడి విధులు నిర్వహించారు. ఈసారి కూడా అదే తరహాలో పోస్టింగ్ సాధించేందుకు ఈ ముఠా ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం. అయితే పోలీస్ పోస్టింగ్స్ విషయంలో గతంలో పరిస్థితులే పునరావృతమైతే ఈసారి సహించేది లేదని కూటమి బహిరంగంగానే హెచ్చరిస్తోంది. పోలీసుల పోస్టింగ్స్ విషయంలో కొత్తగా ఎన్నికైన ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా మెతకవైఖరి అవలంబిస్తున్నారనే వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలో పోలీస్ పోస్టింగ్ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఇప్పటికే అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

బాధితులకు గుర్తింపు..

గతంలో ఇబ్బందులు పడినవారు అన్యాయానికి గురైన వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించినట్లు సమాచారం. గడిచిన ఐదేళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారుల జాబితాను కూడా తయారు చేసేందుకు కసరత్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ దఫా ఎస్పీ నుంచి డీఎస్పీ, సీఐ పోస్టింగ్స్ వరకు అధిష్ఠానం స్థాయిలో కసరత్తు జరిగిన తర్వాతే నిర్ణయాలు ఉంటాయని పోలీస్ అధికారులతో పాటు పార్టీ ముఖ్య నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారులతో పాటు అధికార పార్టీ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారమే పనిచేసిన వారికి కూడా తగిన అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖ అధికారి తిప్పలు

పోలీస్ శాఖలో పరిస్థితి ఇలా ఉంటే విద్యుత్ శాఖలో పరిస్థితి మరోలా ఉంది. గడిచిన ఐదేళ్లు అధికార పార్టీ నేతలతో అంట కాగి అతిగా వ్యవహరించిన ఓ అధికారి తిరిగి పోస్టింగ్ కోసం పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు కేబుల్ వ్యాపారంలోకి దిగి కేబుల్ రంగంలో పాతుకుపోయిన ఓ సంస్థను ఢీ కొట్టిన విషయం విదితమే. ఆ సమయంలో ఈ అధికారి వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా భావించి కేబుల్ వైర్లు కత్తిరించడంలోనూ, విద్యుత్ స్థంబాలకు కేబుల్ వైర్లు ఉండరాదని, లేదంటే ఒక్కో స్థంభానికి రూ.50 చెల్లించాలని బెదిరించారు. అంతేగాక ఆపరేటర్లు, కేబుల్ బాయ్‌లపై పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టి అరెస్టులు చేయించడంలోనూ ఈయన కీలకంగా వ్యవహరించినట్లు కేబుల్ ఆపరేటర్లు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలి. అయితే ఆ అధికారికి గతంలో వేరే పార్టీలో ఉన్న నాయకులతో తనకున్న సంబంధాలతో ఆయన అక్కడి ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్రాంతి సంబరాలకు ఏకంగా రశీదు పుస్తకాలు ముద్రించి పెద్ద ఎత్తున బలవంతంగా వసూళ్లకు పాల్పడి, కొంత పల్నాడు ప్రాంతానికి చెందిన వైసీపీ ప్రజా ప్రతినిధికి ముట్టచెప్పాడనే విమర్శలున్నాయి. టీడీపీ నాయకుడిని అక్రమంగా సీఐడీ కేసులో గత ప్రభుత్వం అరెస్ట్ చేసిన సందర్భంలో ఆయనను పరామర్శించేందుకు నేరుగా పార్టీ అధినేత చంద్రబాబు రాగా ఆ సమయంలో ఉద్దేశపూర్వకంగానే విద్యుత్ సరఫరా నిలిపించినట్లు కూడా ఆరోపణలు ఎదుర్కొన్నారు.

వెయ్యి ఆర్థోపెడిక్ సర్జరీల మైలురాయి సాధించిన డీవీసీ హాస్పటల్


సమావేశంలో మాట్లాడుతున్న డీవీసీ హాస్పటల్స్ చైర్మన్, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

● చైర్మన్ నరేంద్రకుమార్ ● డాక్టర్ జి.జగదీష్‌కు అభినందనలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూన్ 25: ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ గుడారు జగదీష్ ఆధ్వర్యంలో డీవీసీ హాస్పటల్ వెయ్యి ఆర్థోపెడిక్ సర్జరీలు అచిరకాలంలోనే పూర్తిచేశామని హాస్పటల్ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. వడ్లమూడి డీవీసీ హాస్పటల్‌లో మంగళవారం ఆర్థోపెడిక్ విభాగం వెయ్యి సర్జరీలు పూర్తి చేసుకున్న సందర్భంగా డాక్టర్ గుడార్ జగదీష్‌ను అభినందించారు. చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో బర్డ్ హాస్పటల్ మాజీ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ 2019లో డీవీసీ హాస్పటల్‌లో సేవలు ప్రారంభించారన్నారు. ఐదేళ్ల కాలంలోనే వెయ్యి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో డాక్టర్ జగదీష్ అసాధారణ నైపుణ్యం, అంకితభావం, రోగుల సంరక్షణలో అకుంఠిత దీక్షతో ఉన్నారని కొనియాడారు. అత్యుత్తమ వైద్య సదుపాయాలను, అధునిక పద్ధతులను అవసరాలకు అనుగుణంగా హాస్పటల్ నిర్వహణ ద్వారా తాము సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, సీవోవో డాక్టర్ నవీన్ కరణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ జేసీకి జాతీయస్థాయి ఏఏ రేటింగ్


సర్టిఫికెట్లను కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు (విద్య), జూన్ 25: ఎన్‌టీపీటీఈఎల్ మద్రాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో 11వ సారి ఏఏ రేటింగ్ వచ్చినట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఐటీ-మద్రాస్ నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్ పరీక్షకు అత్యధిక మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌లను ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు అందుకున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న 6,335 చాప్టర్స్‌లో తమ కళాశాల లోకల్ చాప్టర్ జాతీయస్థాయిలో అత్యుత్తమ స్థానంలో ఉన్నట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లను కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త, సీఎస్‌బీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎంపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో పీసెట్ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, జూన్ 25: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ దేహదారుఢ్య పరీక్షలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలను మంగళవారం నుండి ప్రారంభించినట్లు పీసెట్ -2024 కన్వీనర్ ప్రొఫెసర్ పి.జాన్సన్ తెలిపారు. చివరి రోజు 27వ తేదీన మహిళా అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దేహదారుఢ్య పరీక్ష లలో 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, 800 మీటర్ల పరుగుతో పాటు అభ్యర్థి ఎంపిక చేసుకున్న ఒక ఆటలో ప్రావీణ్యం పరీక్షిస్తారు. వీటితోపాటు అభ్యర్థులు తాము సాధించిన జాతీయ, అంతర్జాతీయ పోటీలలో క్రీడా ప్రతిభకుగాను ప్రోత్సాహక మార్కులు కేటాయించ నున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు 580మంది అభ్యర్థులకుగాను 379మంది అభ్యర్థులు హాజర య్యారు. ఈ పరీక్ష నిర్వహణ కొరకు రాష్ట్రం నుండి వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల వ్యాయామ అధ్యాపకులు, స్టేట్ కమిటీ సభ్యులను పర్యవేక్షకులుగా వ్యవహరించారు.


రన్నింగ్ పోటీలో తలపడుతున్న అభ్యర్థులు


కబడ్డీలో తలపడుతున్న అభ్యర్థులు

ఎంపీగా పెమ్మసాని ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంటుసభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. 'పెమ్మసాని చంద్రశేఖర్ అను నేను.. లోక్‌సభ సభ్యుడిగా ఎన్నుకొనబడిన వాడనై శాసనము ద్వారా..' అంటూ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పార్లమెంట్ వేదికగా తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భర్తృహరి మెహతాబ్‌కు అభివాదం చేసారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ తనకు ఎంపీగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, 3 లక్షల భారీ మెజారిటీతో గెలిపించిన గుంటూరు పార్లమెంట్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయాల ధ్రువపత్రాలపై రాజముద్ర

పిడుగురాళ్ల, జూన్ 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కార్యాలయాల్లో జారీచేసే ధ్రువపత్రాలపై నాటి ముఖ్యమంత్రి చిత్రపటం కనుమరుగైంది. ఈ ఎన్నికలలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సచివాలయాల్లో జారీచేసే పలురకాల ధ్రువపత్రాలపై జగన్ బొమ్మను తొలగించి రాజముద్ర వున్న హైసెక్యూరిటీ ఫామ్స్ సచివాలయాలకు అందాయి. గత వైసీపీ పాలనలో జగన్ బొమ్మ వున్న హైసెక్యూరిటీ పత్రాలన్నీ నిలిపివేసి వాటి స్థానంలో రాజముద్రతో వున్న హైసెక్యూరిటీ ఫామ్స్‌ను ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది.


సచివాలయాల్లో గతంలో జారీచేసిన ధ్రువపత్రాలపై జగన్ చిత్రం


కొత్తగా జారీచేసే ధ్రువపత్రంపై జగన్ చిత్రం స్థానంలో వున్న రాజముద్ర

పడవలకు, బల్లకట్టులకు వేలం

అచ్చంపేట, జూన్ 25: గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలోని రేవులైన చామర్రు, చింతపల్లి, గింజుపల్లి, తాడువాయి, మాదిపాడులలోని పడవలు, బల్ల కట్టులకు ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో షీల్డ్ టెండర్ల ద్వారా వేలం నిర్వహిస్తున్నట్టు అచ్చంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుసుమకుమారి తెలిపారు. 2024 - 2025 సంవత్సరానికి జూలై 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు ఈ పాటలు అమల్లో ఉంటాయ న్నారు. గుంటూరులో జరిగే షీల్డ్ టెంటర్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహిస్తారని తెలిపారు.

నేడు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

గుంటూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): నిత్యం విశాఖపట్టణం-లింగంపల్లి-విశాఖపట్టణం మధ్యన ప్రయాణించే జన్మ భూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 26వ తేదీ బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. నెం.12805 విశాఖపట్టణం- లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మంగళవారమే పునరుద్ధరణ జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వలన బుధవారానికి వాయిదా పడిందన్నారు. అలానే నెం.12806 లింగంపల్లి- విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈనెల 26కి బదులు 27న పునరుద్ధరిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించి రైల్వేశాఖకి సహక రించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థల బస్సులపై 18 కేసులు


విద్యాసంస్థల బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

గుంటూరు(తూర్పు), జూన్ 25: నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో భాగంగా పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన బస్సులపై 18 కేసులు నమోదు చేశారు. ఇందులో ఫిట్నెస్ లేకుండా తిరుగుతున్న అగ్నిమాపక పరికరం లేని బస్సులపై 3, యూనిఫామ్ లేని డ్రైవర్లపై 11, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించినందుకు 2, నిబంధనలు పాటించని బస్సులపై 2, మొత్తం 18 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ బస్సులపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

వివిధ కేసుల్లో నిందితులకు జైలు

నరసరావుపేట లీగల్, జూన్ 25: వివిధ కేసుల్లో నేరం రుజువవ్వటంతో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ ఏడాది మార్చి 3న మండలంలోని రావిపాడుకు చెందిన పతకమూరి అంజనాదేవి వ్యక్తి గత పనుల నిమిత్తం తొండపి గ్రామానికి వెళ్తూ రూపెనగుంట్ల అడ్డరోడ్డు వద్ద ఆటోలో దిగింది. తన బాబాయి కోసం ఆమె వేచి చూస్తుండగా ముఖానికి మాస్క్ పెట్టుకున్న ఓ వ్యక్తి మాటలు కలిపి తాను అటే వెళ్తున్నానని, మోటారు సైకిల్ ఎక్కించుకొని మార్గమధ్యంలో ఆమె మెడలోని 39 గ్రాముల బంగారు నగలను తెంచుకొని వెళ్ళాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నకరికల్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడైన పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన షేక్ నాగూర్ బాషా, ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన ఆరె మురళీమోహన్‌రెడ్డిలను అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో నాగూర్‌బాషాకు ఏడాది జైలు, వెయ్యి రూపాయల జరిమానా, మురళీమోహన్‌రెడ్డికి మూడు నెలల జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ ఎన్ విజయకుమార్ నిర్వహించారు. కాగా ఇదే నిందితులపై నరసరావుపేట రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన మరో కేసు కూడా రుజువవ్వటంతో ఒక్కొక్కరికి మూడు నెలలు జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన సుందర పారిజాతం గత ఏడాది డిసెంబరు 8న వ్యక్తిగత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చింది. మార్కెట్ సెంటర్‌లో సరుకులు కొనుగోలు చేయటానికి వెళ్ళగా నిందితులు ఆమె మెడలోని 16 గ్రాముల బంగారు నగలను లాక్కు వెళ్ళారు. ఈ మేరకు నేరం రుజువవ్వటంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరావు నాయక్ నిర్వహించారు.

29న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి..

● జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



గుంటూరు, జూన్ 25: ఈ నెల 29న గుంటూరు జిల్లా అంతటా అన్ని కోర్టులలో జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు త్వరితగతిన కేసులు పరిష్కారం కొరకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కోరారు. జిల్లా అంతటా ఉన్న కోర్టులలో ఈ నెల 29న జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరుపక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వీలైనంత వరకు ఎక్కువగా కేసులను డిస్పోజల్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జరగనున్న ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో ఇరుపక్షాల సమ్మతితో ఆయా కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర కేసులను కూడా వీలైనంతవరకు ఎక్కువగా డిస్పోజల్ చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. కోర్టు నందు కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు వారి కేసులను లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలని సూచించారు. కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, సత్వరం పరిష్కారం లభిస్తుందని, ఇరుపక్షాల మధ్య స్నేహపూరిత సంబంధాలు ఉంటాయని పేర్కొన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెదకాకాని, జూన్ 25: కాకాని రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు ఆనంద్‌పేటకు చెందిన సయ్యద్ సుభాని(45) తన అన్న సయ్యద్‌దావూద్‌కు చెందిన ఆటోనగర్‌లోని పాతసామాన్ల కొనుగోలు దుకాణంలో పని చేస్తుంటాడు. గత రాత్రి కాకాని రోడ్డులో బస్టాండ్ వైపు నడుచుకుంటూ వస్తుండగా ఆటోనగర్ కాంప్లెక్స్ సెంటర్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సుభాని అక్కడికక్కడే మృతిచెందారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147, 156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

51,353 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,183 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 51,353 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 19,393 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	17000	334	11000	16500
నెంబరు. 5	9000	15500	నెంబరు.5	13000	15500
273	9500	14000	273	15500	16000
341	8500	16500	341	8500	17500
4884	17000	17000	4884	9000	9000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19700	తేజ	9000	20000
బ్యాడిగి	9000	17500	బ్యాడిగి	9500	16000
దేవనూరు డీలక్స్	9500	16000	దేవనూరుడీలక్స్	9500	12000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	12000



స్టేడియంను పరిశీలించి, క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

బీఆర్ స్టేడియం రూపు రేఖలు మారుస్తా

● తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బ్రహ్మానందరెడ్డి స్టేడియం రూపురేఖలు మారుస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో మంగళవారం ఆయన పర్యటించారు. నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద స్టేడియం బ్రహ్మానందరెడ్డి స్టేడియమని, దాదాపు 19 ఎకరాలలో నిర్మించిన స్టేడియం వేలాదిమంది అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసిందని గుర్తు చేసారు. గత ఐదేళ్లుగా స్టేడియం అభివృద్ధికి నోచుకోలేదని ఆయన విమర్శించారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడుదామా ఆంధ్ర.. పాడుదాం తీయగా అంటూ కబుర్లు చెప్పారే గాని స్టేడియం అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. స్టేడియం ముఖద్వారం గేటు దగ్గర నుంచి పార్కింగ్, వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియం మరమ్మతులు చేయించడం, తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి స్టేడియానికి మహర్దశ తీసుకొస్తామన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో బాస్కెట్ బాల్ క్రీడాకారులను అందించిన బాస్కెట్ బాల్ కోర్టులను తొలగించారని, మరలా బాస్కెట్ బాల్ కోర్టును పునరుద్దరించే చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో శాప్ అధికారి, డీఎస్‌డీవో నరసింహారెడ్డి, ఏఈ సునీల్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, కార్పొరేటర్లు మీరావలి, మొయిద్దీన్ చిష్టి, రియాజ్, కొత్తూరి వెంకట్, సత్యం, అల్లం బాజీ, జూలూరి గుప్తా, అస్గర్ అలీ, బాజీ, ఫారుక్, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి రహిత గుంటూరుగా తీర్చిదిద్దుతా: నసీర్

గంజాయి రహిత గుంటూరుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీని మంగళవారం ఆయన మర్యాదపూర్వంకంగా కలిశారు. గుంటూరును గంజాయి రహిత గుంటూరుగా తీర్చిదిద్దాలని ఆయన ఎస్పీని కోరారు.

● గడ్డిపాడు ఎంపీయూపీ స్కూలులో విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే నసీర్ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు విద్యార్థులకు అందజేశారు.

పాఠశాలల్ని తనిఖీ చేసిన డీఈవో

గుంటూరు(విద్య), జూన్ 25 : జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఆవాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్, పాఠ్య పుస్తకాలు త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాల పంపిణీలో నిబంధనలను పాటించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఏర్పడే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. "నేను బడికి పోతా" కార్యక్రమంలో భాగంగా రోజువారి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలన్నారు.



విద్యార్థుల పఠన సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈవో శైలజ

రేపు ఐటీఐ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జాబ్‌మేళా

గుంటూరు(విద్య), జూన్ 25 : ఈనెల 27న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ద్వితీయ సంవత్సరం కోర్సు చదువుతున్న వారికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ సాయివరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వివిధ సంస్థలు, పారిశ్రామిక వేత్తలు వస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాంపస్ డ్రైవ్ ప్రారంభమౌతుందన్నా రు. ఆసక్తి, అర్హత ఉన్న వారు పూర్తి వివరాలకు 73868 85639, 83339 73929లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం హర్షణీయం : ఎన్‌టీఏ

గుంటూరు(విద్య), జూన్ 25 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నడిపినేని వెంకటరావు, బొనిగల హైమారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ ఏటా డీఎస్సీ కోసం చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం అభినందనీయమని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వ చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూన్ 25 : స్థానిక ఆర్టీసీ కాలనీ, శీ లక్ష్మీ శ్రీనివాస ఓంకారేశ్వర అయ్యప్ప స్వామి వారి పంచదశ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయి బాబా శర్మ పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ శర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు బద్రీశ్వర రావు కళాకారులను ఘనంగా సత్కరించారు.

పండ్ల దుకాణంలో వ్యక్తి మృతి

గుంటూరు, జూన్ 25 : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రింగురోడ్డులో గల పండ్ల దుకాణంలో పని చేసే ఆనందపేట ఒకటో లైన్‌కు చెందిన షేక్ ఆసిఫ్ (38) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గుజ్జనగుండ్ల నుంచి కొరిటెపాడుకు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కన పండ్ల దుకాణంలో పని చేస్తున్న ఆసిఫ్ చనిపోయి ఉండడాన్ని గమనించి యజమాని భార్య పర్హానాకు సమాచారం ఇచ్చాడు. దీంతో భార్య పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రుద్రా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.

పీకలవాగు ప్రక్షాళన ప్రారంభం

● ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

● వైసీపీ పాలనలో పట్టించుకోని పాలకులు

గుంటూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే పశ్చిమ నియోజకవర్గంలో పీకల వాగు సృష్టించే సమస్య అంతా ఇంతా కాదు. వరదలకు వాగు పొంగి ఇళ్లలోకి నీళ్ల వచ్చి ప్రజలు నానా అగచాట్లు పడుతుంటారు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ వాగు బీభత్సాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. కాగా కొత్త ప్రభుత్వం కొలువుదీరినవేళ పీకలవాగులో ప్రక్షాళన మొదలైంది. రోజుల క్రితం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్లా మాధవి మున్సిపల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పీకల వాగు సమస్యపై చర్చించారు. అత్యవసరంగా దీనిని పరిష్కరించాలంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని అధికారులను ఆదేశించారు. దీంతో మునిసిపల్ అధికారులు మంగళవారం పూడికతీత పనులు ప్రారంభించారు. దేవాపురం నుంచి మొదలైన పనులను ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నేతలు పోపూరి నరేంద్ర, స్థానిక నేతలు పర్యవేక్షించారు. గళ్లా మాధవి, పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించిన 48 గంటల్లోనే అధికారులు పనులు చేయటానికి పూనుకోవటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 52వ డివిజన్ అరండల్‌పేట, 28వ డివిజన్‌లోని సీతమ్మకాలనీలో ఎప్పటి నుంచో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీకలవాగు సమస్యను పట్టించుకోకుండా ప్రజలను కష్టాలపాలు చేశారని, తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, నగర సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు.



అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన గళ్లా మాధవి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విద్యాశాఖ అధికారులతో నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి మంగళవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వం కార్పొరేట్ విద్యాలయాలతో సమానంగా విద్యార్థులకు యూనిఫామ్, బ్యాగ్, పుస్తకాల కిట్లు అందజేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు.

బాబాకు ఛాదర్ సమర్పణ

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మాధవి గెలుపు కోసం మొక్కుకున్న తెలుగుదేశం పార్టీ నేతలు మంగళవారం దర్గాలో తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరై బాబాకు చాదర్ పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యే గళ్లా మాధవికి ఫకీర్లతో ఎదురెళ్లి స్వాగతం పలికారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సునీల్

మట్టి నమూనాలు సేకరణ

గుంటూరు(తూర్పు), జూన్ 25: గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు గ్రామంలోని పొలాల్ని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సునీల్ సందర్శించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులందరూ విధిగా తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో మట్టి నమూనాలను సేకరించి గుంటూరు భూసార పరీక్షా కేంద్రానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూమిలోగల ప్రధాన, ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.సుబ్రహ్మణ్యం, వీఏఏ అమూల్య, నిర్మలా మేరీ, రైతులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరస్వామికి విశేషాభిషేకాలు

గుంటూరు(తూర్పు), జూన్ 25 : స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఎంకేఆర్ అయ్యప్ప స్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ ఛైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నిత్య పూజలు, గోపూజ, పర్వత వర్దిని అమ్మవారికి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి విశేషాభిషేకాలు ఆలయ పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మండప దేవత పూజలు, శ్రీ సూక్త హోమం, శ్రీ లలిత సహస్రనామ హోమం రుత్వికులు నిర్వహించారు. సాయంత్రం రుద్ర. నవగ్రహ హోమాలు నిర్వహించారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.



స్వామివారికి విశేష సేవలు చేస్తున్న అర్చకులు

వైభవంగా స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం

గుంటూరు(తూర్పు), జూన్ 25 : స్థానిక కృష్ణనగర్, శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ ధనకుదరం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారికి అష్టోత్తర శత కలశాభిషేకం విశేషంగా జరిగింది. తొలుత కలశారాధన, విశేష పూజలు నిర్వహించి భక్తులు కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారి అభిషేకంతో సేవించుకొన్నారు. సాయంత్రం శ్రీ గోదాపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి దివ్య కల్యాణం తీర్థ ప్రసాద వితరణ చేశారు. ధనకుదరం శ్రీనివాసాచా ర్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో బుధవారం మహా పూర్ణాహు తి, అన్నప్రసాద వితరణ వంటి విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



స్వామివారికి శత కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

రామాయణం ఒక అమృత సాగరం



ప్రవచనం చేస్తున్న కేవీ కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జూన్ 25 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సుందర సత్సంగ్ సభ్యులు, ఆధ్యాత్మిక ప్రవచకులు కెవి కోటేశ్వరరావు సంక్షిప్త రామాయణం ధారావాహిక ప్రవచనంలో భాగంగా మంగళవారం ప్రవచనాన్ని ప్రారంభిస్తూ రామాయణం ఒక సుధా సాగరం అన్నారు. రామాయణంలోని ప్రతి బిందువు ప్రాణప్రదం, ప్రతి అక్షరం మోక్షప్రదం, పాపనాశనం అన్నారు. ఈ రామాయణం భూప్రపంచమున నదులు, పర్వతాలు ఉన్నంత వరకు నిలిచి ఉంటుందని బ్రహ్మదేవులు వాల్మీకికి తెలిపారు.. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సత్సంగ్ సభ్యులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయం ఎమర్జన్సీ

గుంటూరు, జూన్ 25 : భారతదేశ ప్రజాస్వామ్యంలో ఎమర్జన్సీ అనేది ఓ చీకటి అధ్యాయంగా నిలిచిపోతుందని సీనియర్ న్యాయవాది అవదానుల హరి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక హక్కుల అణచివేత, అరెస్టుతో 21 నెలలు కొనసాగిన ఎమర్జన్సీ నేటికీ ప్రజలు మరిచిపోలేనిదన్నారు. అంతర్గత అలజడి పేరుతో ఎమర్జన్సీ విధించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపారని, ఎన్నికలను వాయిదా వేశారని, ప్రభుత్వ వ్యతి రేకతను తీవ్రంగా అణచివేయటం, పత్రికలపై నియంత్రణ విధించటం వంటి చర్యలను చేపట్టారన్నారు. విద్యావేత్త చంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఏకపక్ష నిర్ణయంతో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిన రోజు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి, ఆర్‌వీ సింగరయ్య, సుబ్బారెడ్డి, సదాశివం తదితరులున్నారు.

సాగుదారుల హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

● కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూన్ 25 : కౌలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా 2019లో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కు చట్టాన్ని (సీసీఆర్సీ) రద్దు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ తీసుకువచ్చిన చట్టంతో జిల్లాలో దాదాపు ఒక లక్ష మంది కౌలు రైతులు ఉండగా కేవలం 25 వేల మందికి మాత్రమే కౌలు కార్డులు వచ్చాయని అన్నారు. 2011 సంవత్సరంలో తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ అధీకృత రైతుల చట్టాన్ని పునరుద్ధరించాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు ఈమని అప్పారావు, బొట్ల రామకృష్ణ, భీమవరపు అమ్మిరెడ్డి, మేకల చిట్టిబాబు, ఎర్రమాసు నాగేశ్వరరావు, షేక్ ఇమామ్ షరీఫ్, వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు, పాల్గొన్న రైతు సంఘ నాయకులు

అమరావతి మ్యూజియంను అభివృద్ధి చేయాలి : డాక్టర్ జాస్తి

గుంటూరు సిటీ, జూన్ 25 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి పూర్వ వైభవం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని, అందులో భాగంగా మ్యూజియంను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలోని తిలక్ మార్గ్‌లో గల కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో ఆయన విజ్ఞాపన పత్రం అందజేశారు. కేంద్ర పురావస్తు శాఖ మ్యూజియం అధికారి రాహుల్‌తో అమరావతి మ్యూజియంను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతపై చర్చించారు.

మైదానపు క్రీడలతో శారీరక ఉల్లాసం

గుంటూరు(తూర్పు), జూన్ 25 : శారీరక ఉల్లాసానికి మైదానపు క్రీడలు దోహదపడుతాయని బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి గురుదత్‌లు అన్నారు. స్థానిక కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్యా స్కూల్ ఆవరణలో మంగళవారం గ్లోబల్ ఫోర్స్ ఫౌండేషన్, లోటస్ ఆద్య సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు గ్లోబల్ స్పోర్ట్స్ కార్యదర్శి శివప్రసాదును అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు వెంకటేశ్వరరావు, ఉమాదేవి, ఫౌండేషన్ కార్యదర్శి శివప్రసాదు, పీఈటీలు చక్రి, కె.రవి, కే.అరుణ్ కుమార్‌తో పాటు పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి

రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు, జూన్ 25 : స్థానిక నంబూరు - ఐ.జేఎం మధ్యన గల రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే సీఐ గంగా వెంకటేశ్వర్లు, లేదా ఎస్సై వెంకటాద్రికి 7207076614 నెంబరులో తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలి

● కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 25 :: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన ఔట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనులను వేగంగా చేపట్టాలని, పనులకు ముందు, అనంతరం ఫొటోలు తీయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం కమిషనర్ బుడంపాడు, సంగడి గుంట, కమ్మ శేషయ్య గ్రౌండ్ రోడ్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ డ్రెయిన్లలో జరుగుతున్న పూడికతీత పనులను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వర్షం నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పూడికతీత పనులు చేపట్టాల న్నారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్‌ఓ(ఎఫ్‌ఏసి) మధుసూదన్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఎస్‌ఎస్‌లు రాంబాబు, ఆయుబ్ ఖాన్, డీఈఈ శ్రీధర్, ఏఈలు సునీల్ కుమార్, రాంబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి.



ఉప ముఖ్యమంత్రి, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ను టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి రహిత ఏపీగా తీర్చిదిద్దాలి

● డీజీపీకి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల వినతి

గుంటూరు(తూర్పు), జూన్ 25 : గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని డీజీపీ ద్వారక తిరుమలరావును ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కోరారు. డీజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ద్వారక తిరుమలరావును మంగళవారం మర్యాదపూర్వకంగా ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గంజాయి కట్టడిలో ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉంటుందని డీజీపీకి ఆయన హామీ ఇచ్చారు. అంతేగాక ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టాలని డీజీపీని కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, టీడీపీ నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



డీజీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

దూదేకుల సంక్షేమానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే బూర్లకు విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), జూన్ 25 : మైనార్టీ ముస్లింలకు వర్తించే పథకాలన్ని దూదేకులకు వర్తింపచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి లాల్‌వజీర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక విద్యానగర్లోని ఆయన కార్యాలయంలో మంగళవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యేను మైనార్టీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం లాల్‌వజీర్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మైనార్టీ బడ్జెట్లో దూదేకుల కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి స్వయం ఉపాధికి రుణాలివ్వాలని అన్నారు. కార్యక్ర మంలో హుస్సేన్, లోకేష్, మస్తాన్‌వలీ, శివశంకర్, జనసేన నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదల శకుంతలకు ఘన నివాళి

గుంటూరు, జూన్ 25 : నగరంలోని తారకరామనగర్, శ్రీనివాసనగర్ కాలనీల్లో మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మాదల శకుంతల సంస్మరణ సభ మంగళవారం జరిగింది. కళాశాల వ్యవస్థాపకులు, వైస్ ఛైర్మన్ మాదల రత్నగిరిబాబు, జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ మాదల సుధాకర్, మాదల చైతన్య, మాదల శ్రీరామ్‌భాస్కర్, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సామినేని కోటేశ్వరరావు, కళాశాల ట్రెజరర్ గోపిచంద్, ప్రిన్సిపల్ బిందు, కళాశాల, జనచైతన్య సిబ్బంది, విద్యార్థులు శకుంతల చిత్రపటానికి పూలతో ఘన నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు.



మాదల శకుంతల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల, జనచైతన్య సిబ్బంది తదితరులు

ముగిసిన వేసవి అథ్లెటిక్ శిక్షణ శిబిరం

గుంటూరు(తూర్పు), జూన్ 25 : జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గత 40 రోజులుగా జరిగిన వేసవి అథ్లెటిక్ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమానికి అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, నెక్స్‌జెన్ స్కూల్ డైరక్టర్ శ్రీకాంత్ ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ శిబిరంలో దాదాపు 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడి సాంబశివరావు, పీఈటీలు జీజే కిషోర్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్స్‌తో క్రీడాకారులు, పాల్గొన్న కోచ్‌లు

విలక్షణ కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ

ఒక వస్తువుని ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, దానిని అంతే భద్రంగా వినియోగదారుడికి చేర్చడం కూడా ప్రధానమే. ఈ ప్రక్రియలో కూడా ఎంతో మంది పాల్గొంటారు. అందులో ప్యాకేజింగ్ ముఖ్యమైనది. వస్తువు స్వరూప స్వభావాలను అనుసరించి అవసరమైన విధంగా అట్టపెట్టె లేదంటే మరొకదానిలో పెట్టాలి. భద్రంగా దానిని వినియోగదారుడి ఇంటికి లేదంటే తను సందర్శించే షాపు వద్దకు చేర్చాలి. ఈ ప్రాసెస్ మొత్తం ప్యాకేజింగ్ కిందకు వస్తుంది. ఈ రంగంలో ప్రాథమిక కోర్సు 'డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'. హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది.



గ్రామాలు లేదంటే సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి పట్టణాలకు వెదురు బుట్టలు, తాటాకు తట్టల్లో కూరగాయలు, పండ్లు వస్తుంటాయి. జనుము సంచీల్లో బియ్యం రవాణా అవుతుంది. అయితే సాంకేతిక పురోభివృద్ధితో ప్యాకేజింగ్ అక్కడితో ఆగలేదు. ఒక హోటల్ నుంచి వండిన ఆహార పదార్థం, ఒక ఫార్మా కంపెనీ నుంచి పలు రకాల మందులు డిస్ట్రిబ్యూటర్‌కు చేరుకోవడం మొదలుకుని రకరకాల వస్తువులు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం నేడుంది. ఆ క్రమంలో వస్తువు చెడిపోకుండా వినియోగదారుడికి చేర్చే ప్రక్రియకు సాంకేతికతను జోడించారు. దానిని పటిష్ఠంగా అమలు చేసేందుకు ప్యాకేజింగ్ ప్రధాన ఊతంగా మారింది. దేశీయంగా మధ్యతరగతి ఎదుగుదల, వ్యవస్థీకృత రీటైల్ రంగ విస్తరణ, ఎగుమతుల్లో పెరుగుదల ఫలితంగా ఈ కామర్స్ బలపడింది. అది సహజంగానే ప్యాకేజింగ్ పెరుగుదలకు దోహదపడింది. కొవిడ్ సంక్షోభం ఊహించని పెనుముప్పు. అయితే, ప్యాకేజింగ్ పరిశ్రమకు మాత్రం మంచి ఊపునిచ్చింది. ఒక పక్క ఔషధ పరిశ్రమ, మరోపక్క ఇంటికే నేరుగా డెలివరీలతో ప్యాకేజింగ్ పరిశ్రమ అవసరం బాగా పెరిగింది. ఆహారం నుంచి అవసరమైన వస్తువు వరకు ఏదైనా సరే, తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటికే తెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

కోర్సుగా: హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. 1996లో దీన్ని ఇక్కడ ఆరంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఒక్క పాలిటెక్నిక్ మాత్రమే ప్యాకేజింగ్ టెక్నాలజీలో డిప్లొమాను అందిస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. అత్యంత ప్రతిభావంతులైన ఫ్యాకల్టీ ఈ కోర్సును తీర్చిదిద్దడం నుంచి తమ విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేందుకు తద్వారా వారు ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

ఉన్నత చదువులు

- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరవచ్చు.
- హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీలో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

ఉపాధి: ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఈ ఏడాది 16 మందిని తీసుకున్న రెడ్డి ల్యాబ్స్ ఒకొక్కరికి స్టయిపెండ్‌గా రూ.15,000 చెల్లిస్తోందని ప్యాకేజింగ్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ వై.వెంకటరెడ్డి తెలిపారు. తదుపరి మరో ఆరు నెలలు కూడా అదే స్టయిపెండ్‌కు పనిచేస్తే రెగ్యులర్ స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా అరబిందో సహా పలు కంపెనీలు కూడా తమ విద్యార్థులను ఈ ఏడాది తీసుకున్నాయని తెలిపారు. చివరకు కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులను సైతం కంపెనీలు తీసుకునే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

SCHOLARSHIP ALERT

Kotak Life Insurance Scholarship Program

Description: An initiative by Kotak Life Insurance Company Ltd. to provide financial assistance to students from Tamil Nadu and Maharashtra to help them pursue their undergraduate studies in the commerce stream.

Eligibility:

- Open to students who are residents of Tamil Nadu and Maharashtra.
- Applicants must be enrolled in the first year of a B.Com. program at any of the eight specified colleges in Tamil Nadu and Maharashtra. The list of colleges is given below:
- A. Veeriya Memorial Sri Pushpam College (Thanjavur, Tamil Nadu)
- Nadar Mahajana Sangam S. Vellaichamy Nadar College (Madurai, Tamil Nadu)
- Edayathangudy G.S. Pillay Arts and Science College (Nagapattinam, Tamil Nadu)
- Jai Hind Sindhu Education Trust's Manghanmal Udharam College of Commerce (Pune, Maharashtra)
- Gokhale Education Society's B.Y.K. (Sinnar) College of Commerce (Nashik, Maharashtra)
- LRD and SRP College for Women (Nagpur, Maharashtra)
- Vysya Arts and Science College (Salem, Tamil Nadu)
- Dharmapuram Adhinam Arts College (Mayiladuthurai, Tamil Nadu)
- Applicants must have scored 65% marks or more in Classes 10 and 12.
- Applicants must have passed Class 12 in the year 2023-24.
- The applicant's annual family income must be INR 3,60,000 or less.

Prizes & Rewards: Up to INR 30,000 per year

Last Date: 31-07-2024 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/KLISP2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 *Last Date:* 30-07-2024

Application mode: Online only *Short Url:* www.b4s.in/aj/SIHE15

దిక్సూచి DIKSUCHI

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) *Last Date:* 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FsGGu7Qలో చదవండి.

జేఎన్‌టీయూకేలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్(ఐసీపీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలసి ఆరేళ్ల ప్రోగ్రామ్‌ను, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ నార్తరన్ అయోవా(యూఎన్ఐ)తో కలసి నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



జేఎన్‌టీయూకే-బీటీహెచ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ&ఎంఎల్), ఈసీఈ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను ఐఐటీ జేఈఈ మెయిన్ అభ్యర్థులకు మిగిలిన సగం సీట్లను టీజీ/ఏపీ ఈఏపీసెట్ అభ్యర్థులకు నిర్దేశించారు.

- ప్రోగ్రామ్ మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు బీటీహెచ్-స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి కాకినాడ జేఎన్‌టీయూ బీటెక్ డిగ్రీని, బీటీహెచ్ బీఎస్ డిగ్రీని ప్రదానం చేస్తాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది.

ఎంఎస్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్-సిస్టమ్స్.

జేఎన్‌టీయూకే-యూఎన్ఐ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో ఈఈఈ స్పెషలైజేషన్ ఉంది. మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి ఏడాది యూఎన్ఐ-యూఎస్ఏలో చదవాలి. వీరికి జేఎన్‌టీయూకే నుంచి బీటెక్ డిగ్రీ, యూఎన్ఐ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు యూఎన్ఐలో కోర్సును కొనసాగిస్తూ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరే వీలుంది.


అర్హత వివరాలు: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత తప్పనిసరి.

- బీటీహెచ్ నిబంధనల ప్రకారం ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ అర్హత పొందాల్సి ఉంటుంది. టోఫెల్‌లో 575/90 స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5 స్కోర్‌తోపాటు మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్ రావాలి.
- యూఎన్ఐ నిబంధనల ప్రకారం ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా టోఫెల్‌లో 79 స్కోర్ ఉండాలి. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే బీఎస్ డిగ్రీలో కనీసం 3.0 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఉండాలి. మూడు రికమండేషన్ లెటర్లు, పర్సనల్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ - 533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

నవ్య చిత్రజ్యోతి

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.

ఎలా ఉన్నావ్ శ్రీలీల

● బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్



శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహాద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

నేతాజీ మార్గంలో నేను



'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

శ్రీనివాసుని సన్నిధిలో సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/adGg9cX లో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కొలకలూరు రైల్వేవంతెనపై వెలుగుతున్న విద్యుత్ లైట్లు

కొలకలూరు రైల్వేవంతెనపై వెలుగులు

తెనాలి రూరల్, జూన్ 25: కొలకలూరు రైల్వే వంతెనపై అంధకారం నెలకొన్న విషయంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనంపై అధికారులు స్పందించారు. కొన్ని సంవత్సరాలుగా రైల్వేతంతెనపై లైట్లు వెలగకుండా అలంకార ప్రాయంగా మారాయి. దీనిపై రాత్రులు రాకపోకలు సాగించేవారు వెలగని లైట్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రజ్యోతి కథనంతో అధికారులు వంతెనపై ఉన్న లైట్లను మరమ్మతులు చేసి విద్యుత్ వెలుగులను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి కొలకలూరు గ్రామస్థులు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు

డ్రెయిన్‌లలో సిల్టు తొలగింపు

తెనాలి, మారీసుపేట జూన్ 25: పట్టణంలోని ప్రధాన డ్రెయిన్‌లలో సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న చేపట్టారు. స్థానిక బోసురోడ్డులో స్వరాజ్ టాకీసు సెంటర్‌లో మంగళవారం ప్రధాన డ్రెయిన్‌లలోని సిల్ట్‌ను మున్సిపల్ అధికారులు జేసీబీల సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న మాట్లాడుతూ వర్షకాలం నేపథ్యంలో పట్టణంలో మురుగు కాల్వలు, కల్వర్టులు, డ్రెయిన్‌లు, ఇరిగేషన్ కాల్వలలో మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పట్టణంలో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన కల్వర్టులలోని సిల్ట్‌ను తొలగిస్తున్నామని, గంగానమ్మపేటలో డ్రెయిన్‌లోని సిల్ట్‌ను కూడా తొలగిస్తామన్నారు. ప్రజలు కూడా చెత్తను కాల్వలలో వేయరాదని, రెండు బుట్టల విధానాన్ని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుబ్బారావు, ఏఈ చైతన్య శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

అవినీతి కేసుల్లో జగన్ జైలుకు వెళ్లాడు: వీరవల్లి

తెనాలి రూరల్, జూన్ 23: మాజీ మంత్రి పేర్నినాని చెబుతున్నట్లు జగన్ జైలుకు వెళ్లింది ప్రజల సొమ్ము వేల కోట్లు దోచుకుని మాత్రమే అని, దేశ సేవకో సమో.. ప్రజలకు మంచి చేయడానికో కాదని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి విమర్శించారు. వీరవల్లి మురళి అంగలకుదురులో పేర్నినాని చేసిన వ్యాఖ్యలను మంగళవారం ఖండించారు. ఈ సందర్భంగా వీరవల్లి మాట్లాడుతూ 16నెలలు జైల్లో ఉంటేనే జగన్‌మోహన్‌రెడ్డి భయపడలేదు, కూటమి ప్రభుత్వానికి భయపడతాడా.. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం అంటూ పేలుతున్న పేర్నినాని మీ నాయకుడు జైలుకు వెళ్లింది ప్రజాసొమ్ము వేల కోట్లు దోచుకునే కాదా అని మురళి ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజలపై అనేక పన్నులు వేసి ఆర్థికంగా సామాజికంగా దెబ్బతీసిన దుర్మార్గపు ప్రభుత్వం మీది కాదా అని ప్రశ్నించారు. రూ. వేల కోట్ల ప్రజాధనంతో ప్యాలెస్‌లు కట్టింది మీ నాయకుడు కాదా అని ప్రశ్నించారు. కొడాలి నాని కూడా నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. రాష్ట్రాన్ని పాలించేందుకు వైసీపీ ప్రభుత్వం పనికిరాదని స్పష్టమైన తీర్పు ఇచ్చినా సిగ్గురాకపోవడం బాధాకరమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మీడియా ముందుకు వచ్చి దెయ్యాలు వేదాలు వర్ణించినట్టుగా మాట్లాడటం సరి కాదన్నారు.

ఫరూఖ్‌కు సముచిత స్థానం కల్పించడం హర్షణీయం

● రాష్ట్ర ఇమామ్ మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్

తెనాలి రూరల్, జూన్ 25: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ముస్లిం, మైనార్టీలకు సముచితస్థానం కల్పిస్తూ నంద్యాల ఎమ్మెల్యే మహమ్మద్ ఫరూఖ్‌కు మంత్రి పదవి ఇచ్చి తగిన గౌరవం కల్పించటంపై రాష్ట్ర ఇమామ్ మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఫరీద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గెలుపుకోసం రాష్ట్రంలోని అన్ని ముస్లిం సంఘాలను ఏకతాటిపై నడిపించిన విజయవాడకు చెందిన మైనార్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫరూఖ్ షిబ్లీ సేవలను కూడా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు గుర్తించి ఆయనకు కూడా కూటమి ప్రభుత్వంలో తగిన స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మహమ్మత్ ఫరూఖ్ షిబ్లీపై అనేక విధాలుగా తప్పుడుకేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన విషయాన్ని కూడా వారు గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆయన మరింత ఉత్సాహంగా పనిచేస్తూ రాష్ట్రంలో ఉన్న 17 మైనారిటీ సంఘాలను ఏకతాటిపై తెచ్చి కూటమి ఘన విజయానికి కృషిచేశాడన్నారు. సమావేశంలో నాయకులు కరిముల్లా, మసూద్ మౌలానా, షేక్ సత్తార్, షేక్ తౌసిఫ్, షేక్ మునీర్ పలువురు ముస్లిం మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పిడపర్రు లాకు

● బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మాణం ● ఆందోళనలో డెల్టా రైతులు ● పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పిడపర్రు లాకు, పూర్తిగా పాడైపోయిన తలుపులు

కొల్లిపర, జూన్ 25: బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించిన లాకులు కాలం చెల్లి శిథిలావస్థకు చేరుకున్నాయి. రాకపోకలకు, సాగు నిమిత్తం వంద సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టిన లాకులు పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు కూలిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలం పిడపర్రు వద్ద రేపల్లె కుడి కాల్వపై నిర్మాణం చేపట్టిన లాకులు శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. నిర్మాణం చేపట్టి వంద సంవత్సరాలు పైబడినప్పటికి వేలాది ఎకరాలకు సాగునీరు అందించటమే కాక రైతులు పండించిన పంటలను తమ గృహాలకు చేర్చుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. లాకుల గోడలు నెర్రెలు ఇవ్వడంతో పాటు అడుగుభాగాన చువ్వలు కూడ బయటపడ్డాయి. లాకు ఏర్పాటుచేసిన తలుపులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. లాకులకు వెనుకభాగాన ఏర్పాటుచేసిన గేట్లు పాడైపోయాయి. దీంతో పిడపర్రు లాకు ఎప్పుడు కూలిపోతుందేమోనని రైతులు భయపడుతున్నారు. లాకు శిథిలావస్థకు చేరుకుందని అనేకసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ లాకులు కూలిపోతే వేలాది ఎకరాల్లో సేద్యం ఆగిపోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లాకు కూలిపోతుందని భావించిన ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా దానిపై రాకపోకలను నిలిపివేశారు. దీంతో రైతులు తమ పంట పొలాల్లోని ఉత్పత్తులను గృహాలకు తీసుకెళ్ళలానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పిడపర్రు లాకు గురించి అనేక పర్యాయాలు సంబంధించిన అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంపై రైతుల నుంచి తీవ్రవిమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పిడపర్రు వద్ద నూతనంగా లాకులను నిర్మాణం చేపట్టాలని కొల్లిపర మండలం రైతులు కోరుతున్నారు.



నెర్రెలు ఇచ్చిన లాకు అడుగు భాగం, లాకు మీదగా వాహనాలు వెళ్ళకుండా రాయిని పాతిపెట్టిన ఇరిగేషన్ అధికారులు

అధికారులు ప్రజా సేవకే ప్రాధాన్యం ఇవ్వాలి

● ప్రభుత్వం మారింది పద్ధతులు మారాలని హెచ్చరిక
● తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
● గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర నివేదిక ఇవ్వండి
● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



సమీక్షా సవేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 25: ప్రజలు అధికారం ఇచ్చింది ప్రజా సేవ చేయటానికే కానీ అహంకారం చూపెట్టడానికి కాదని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చేబ్రోలు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ శాఖలతో సమీక్ష నిర్వహించారు. నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మారిందని పద్ధతులు మార్చుకోవాలని, మునిపటిలా ఇష్టానుసారం వ్యవహరిస్తే ఇంటికి వెళ్లటమేనని హెచ్చరించారు. సమావేశంలో పలు శాఖల్లో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి నివేదికలను కోరారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు తామే రాజులం అన్నట్లు తమకు ఎవరితో సంబంధం లేదని వ్యవహరిస్తున్నారని, సచివాలయాలకు వచ్చే ప్రజలకు సేవ చేయటానికే ఉద్యోగులు ఉన్నారన్న విషయం గుర్తించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నియమితులయ్యాం కాబట్టి వారుచెప్పిన వారికే పనులు చేస్తామనే ధోరణి విడనాడాలని, ముడుపుల సంస్కృతి వదిలిపెట్టకపోతే వేరే దారి చూసుకోవాలని హెచ్చరించారు. రెవెన్యూ శాఖ సమీక్ష సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మండలంలో 2019-24 వరకు జరిగిన గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమగ్ర నివేదిక కోరారు. వీరనాయకునిపాలెం గ్రామంలో దళితుల అసైన్డ్ భూములో మట్టి తవ్వకాలకు సంబంధించిన ఎన్‌వోసీలు, అనుమతులు కోరారు. అలాగే వడ్లమూడి గ్రామంలో నివేశన స్థలాలకు మెరక పేరుతో మట్టి తరలించుకుపోయారని రవాణాకు సబంధించిన వివరాలు పంచాయతీ అధికారులు అందించాలని ఆదేశించారు. సుద్ధపల్లి, శలపాడు గ్రామాల్లో సర్వే నిర్వహించి లబ్ధిదారులకు ప్లాట్లు ఇవ్వాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సమీక్ష సందర్భంగా చేబ్రోలు మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా తాగునీటి సమస్య అధికంగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందతున్నాయన్నారు. మేజర్ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖలో గత ఎంపీ గల్లా జయదేవ్ నిధులతో పనులు మంజూరు చేయిస్తే కాంట్రాక్టర్ల బెదిరింపులు, వర్క్ ఆర్డర్లు ఇవ్వకపోవటం వంటి చర్యలతో ఎంపీ జయదేవ్ నిధులతో పనులు జరగకుండా అధికారులే అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శలపాడు గ్రామంలో దేవదాయ శాఖ భూముల నిర్మాణం ఎలా చేపట్టారని ప్రశ్నించటంతో అధికారుల నుంచి సమాధానం కరువైంది. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కాల్వలో వీడ్ రిమూవర్ పనులు చేపట్టాలని మురుగు నీటి, సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్, డీఆర్‌డీఏ, వెటర్నరీ, హెల్త్ వంటి పలు శాఖల పనితీరుపై సమీక్షలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులనుద్దేశించి నరేంద్రకుమార్ మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందించటమే తమ లక్ష్యం అన్నారు. సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

జనంమీదపడి దోచుకుంటే ఊరుకోను

పెదకాకాని, జూన్ 25: మీరు డిమాండ్ తగ్గించాలి... మీలో మార్పు రావాలి... గతంలో ఎవరెవరికి ఎంతఇచ్చి ఇక్కడికి వచ్చారు... దానిని వసూలు చేసుకోవాలని జనం మీద పడితే ఇక్కడ నడవదు.... చూస్తూ ఊరుకోను అంటూ పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పెదకాకాని మండలం ఎలక్ట్రికల్ ఏఈ బత్తుల శ్రీనివాసరావుపై ఆగ్రహం చేశారు. మంగళవారం పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ జనం మీద పడి ఇష్టం వచ్చినట్లుగా దోచుకుంటానంటే చూస్తూ ఊరుకోను... పేదలను ఇబ్బంది పెడితే ఉపేక్షించనన్నారు. గతంలో ఎలక్ట్రికల్ విభాగంలో ఏమి జరిగిందో నాకు అంతా తెలుసు... పెదకాకాని పాతూరులో పేదలకు ఎందుకు విద్యుత్ మీటర్లు ఇవ్వలేదు అని ఏఈని ప్రశ్నించారు. దాంతో ఆయన తహసీల్దార్ వివరణ కోసం లేఖ పెట్టానని చెప్పడంతో నరేంద్ర కుమార్ మరింత అసహనానికి గురయ్యారు. లెటర్‌పెట్టే హక్కు మీకెక్కడిది... విద్యుత్ మీటర్ల వ్యవహారంలో తహసీల్దార్‌కు సంబంధం ఏంటి అంటూ ఏఈ శ్రీనివాస్‌పై మండిపడ్డారు. భూములు కన్వర్షన్ కాకుండా ఎన్నో రిజిస్ట్రేషన్ జరిగాయి... వాటన్నిటిని ప్రశ్నించడం లేదు కానీ పెదకాకానిలోని సుందరయ్య కాలనీ, స్వర్ణపురి వేస్టేట్స్ ప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని పెదకాకాని తహసీల్దార్ ఏం రత్నంను ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని తదనుగుణంగా ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించేందుకు పనిచేయాలని ఆదేశించారు. మండలంలో ఎక్కడ చూసినా నీటి సమస్య నెలకొందని ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఇంటింటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు పైప్ లైన్ల నిర్మాణం వంటివి చేపట్టాలన్నారు. దీనిపై పూర్తి వివరాలతో రావాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు...

మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన రివ్యూ సమావేశానికి హాజరు కాని సచివాలయ ఉద్యోగులకు మెమోలు ఇవ్వాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశించారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా ఉండటం అసలు ఉపేక్షించనన్నారు. నిర్ణీత సమయంలో సచివాలయ కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజలకు మరింతగా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో మల్లేశ్వరరావు, తహసీల్దార్ రత్నం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

పెదకాకాని, జూన్ 25: పెదకాకాని గ్రామ మాజీ ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణమూర్తి మాతృమూర్తి బెజవాడ బుల్లిమ్మ, తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త తోట బ్రహ్మయ్య, బోయపాటి ప్రసాదరావు, పంచాయతీ పాలకవర్గం 15వ వార్డు నెంబర్ పోగేలు గోపి పెదనాన్న ఏమినేని పుల్లారావు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వారి స్వగృహాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తీసేకొద్దీ వ్యర్థాలు... డంపింగ్ ప్రదేశాలుగా డ్రెయిన్లు

మంత్రి మనోహర్ ఆదేశాలతో జోరుగా పూడిక తీత



జేసీబీతో తోడుతున్న వ్యర్థాలు

తెనాలి అర్బన్, జూన్ 25: చినుకుపడితే చాలు చెరువులుగా మారుతున్న తెనాలి రోడ్లు ఉండటానికి కారణం ఏమిటో మున్సిపల్ అధికారులకు అవగతమైంది. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో వానాకాలానికి ముందే పలు రహదారుల వెంట డ్రెయిన్లలో పూడిక తీత పనులను మున్సిపల్ యంత్రాంగం చేపట్టింది. గతవారం రోజులుగా మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తీస్తున్న వారికి ట్రాక్టర్ల కొద్దీ వస్తున్న వ్యర్థాలను తరలించలేక సతమతమవుతున్నారు. కాల్వల నిండా కవర్లు, ప్లాస్టిక్ బాటిల్స్, కప్పులు, కొబ్బరి బొండాలు, రకరకాల వ్యర్థాలతో ఉన్నాయి. వీటిని తొలగించే కొద్ది వస్తూనే ఉన్నాయి. దీంతో ఆ మార్గంలో పలు చోట్ల కాల్వల నుంచి వ్యర్థాలను తీసే పని చేపట్టారు. ముఖ్యంగా బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయ స్వామి గుడి వద్ద వివిధ మార్గాల నుండి వచ్చే మురుగునీరు, జంపని డ్రెయిన్‌కు చేరుతుంది. ఈ డ్రెయిన్ ఆక్రమణల కారణంగా కుచించుకుపోవడంతో పాటు వ్యర్థాలు నిలబడిపోయి వాన నీరు, మురుగునీరు ముందుకు కదలకుండా ఉంది. దీంతో వర్షాకాలంలో కొత్తపేటలోని పలు ప్రధాన వీధులతో పాటు బోసురోడ్డు, గాంధీచౌక్ వరకు ఉన్న ప్రధాన రహదారులన్నీ మురుగు కాల్వలు నిండిపోయి వాననీరు, మురుగునీరు ఏకమై రోడ్లపై మోకాలు లోతున ఉంటుంది. రెండు గంటలు గడిస్తే గాని నీరు అంతా డ్రెయిన్ ద్వారా దిగువకు పోదు. మురుగునీరు ఏకం కావడంతో కాల్వల్లోని వ్యర్థాలను రోడ్లపైకి కొట్టుకురావడం, మురుగు పేరుకుపోవడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను గట్టించేందుకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వం రూ.30కోట్లతో పూలే కాలనీ వద్ద నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం ఐదేళ్లయినా పూర్తి కాలేదు. తుది దశలో ఉన్న ఈ ప్లాంట్‌ను త్వరితగతిన పనిచేస్తే వర్షాకాలంలో ఎంతటి వర్షపు నీరు అయినా క్షణాల్లో భారీ ఇంజన్లు లాగేసి వాడుకనీరుగా మార్చి పొలాలకు అందిస్తాయి. పాలకులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



మోకాళ్ళపై కూర్చుని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఎమర్జెన్సీతో దేశాన్ని అంధకారం చేసిన కాంగ్రెస్

● బీజేపీ నేత పాటిబండ్ల రామకృష్ణ

తెనాలి అర్బన్, జూన్ 25: దేశంలో ఎమర్జెన్సీ విధించి అంధకారాన్ని తెచ్చిన కాంగ్రెస్ పరిపాలనకు ఏ మాత్రం అర్హత లేదని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ విమర్శించారు. సరిగ్గా 50ఏళ్ళ క్రితం ఇదేరోజు ఎమర్జెన్సీ విధించారంటూ మంగళవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. బోసురోడ్డు నుంచి గాంధీచౌక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం, రణరంగచౌక్‌ల వద్ద మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అధికారాన్ని కాపాడుకోవడం కోసం ఎన్నడూ లేనివిధంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించి దేశ ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొన్నారని చెప్పారు. ఎమర్జెన్సీతో ఎంతో అపప్రథను మూటగట్టుకున్న కాంగ్రెస్ బీజేపీ నేతలను విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని చేతబట్టి ప్రధాని మోదీ ప్రమాణ స్వీకార సమయంలో గోల చేసిన కాంగ్రెస్ నాయకులకు రాజ్యాంగంపై గౌరవం లేదనే అవగతమవుతుందన్నారు. పార్టీ నాయకులు అడపా సంపత్‌రాయుడు, వాసుదేవనాయుడు, అనంతాచార్యులు, విజయభాస్కర్‌రెడ్డి, రవీంద్ర, నందకిషోర్, వేణు, గుప్తా, ఆదిత్య పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



నిత్య అన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న తక్కెళ్ళపాడు వాసి భైరపునేని నరసింహారావు

పెదకాకాని, జూన్ 25: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామ వాస్తవ్యులు భైరపనేని జయమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త భైరపనేని నరసింహారావు లక్ష రూపాయలను విరాళం అందించినట్లు మంగళవారం దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళం సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

డాక్టర్ అట్లూరి మృతి సిబార్ కళాశాలకు తీరని లోటు

● కళాశాల డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్



సిబార్ కళాశాలలో డాక్టర్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ తదితరులు

పెదకాకాని, జూన్ 25: గుంటూరు జిల్లా తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల ఛైర్మన్ డాక్టర్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ మృతి చెందటం కళాశాలకు తీరని లోటని డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో డాక్టర్ అట్లూరి చిత్రపటానికి యాజమాన్యం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఎంతో బిజీగా ఉండే ఠాగూర్ సిబార్ కళాశాల స్థాపనలో ఎంతో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించి 1960లోనే ఆయన ఎమ్మెస్ పూర్తిచేశారన్నారు. వైద్యరంగంలో ఆయనకు ఎవరూ సాటిలేరని, మంచిపేరు ప్రఖ్యాతలు సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్.సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రవణా నక్షత్ర దోష నివారణకు హోమం

తెనాలి, మారీసుపేట జూన్ 25: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రవణా నక్షత్రం వారిచే యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ రుత్వికులతో హోమంను యజ్ఞ పూజలను నిర్వహించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలు 13వ రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బాలస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శ్రవణా నక్షత్ర దోషాలు ఉన్న వారు ఈ హోమం చేయటంవలన నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, రావూరి సుబ్బారావు, రాజేశ్వరరావు, గోవు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, లోకనాథం, రాంబాబు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



దశావతార సన్నిధిలో జరుగుతున్న ప్రత్యేక పూజలు

దశావతారుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదకాకాని, జూన్ 25: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీ దశావతారవేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయంలోని మహాగణపతిస్వామికి సంకటహర చతుర్థి సందర్భంగా ఘనంగా సంకటహర చతుర్థి వ్రతాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ శ్రీనివాస్

జాతీయ పోటీలకు తైక్వాండో క్రీడాకారులు ఎంపిక

తెనాలి అర్బన్, జూన్ 25: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు తెనాలి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి 30తేదీల వరకు ఒరిస్సాలోని కటక్‌లో నిర్వహించనున్న పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కేఎస్‌ఆర్ అకాడమీ కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అండర్ 50విభాగంలో కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, అండర్ 15విభాగంలో భువనశ్రీ, గౌరీలక్ష్మీ, జోతేంద్రలు పాల్గొంటారని తెలిపారు.